స్క్రిప్ట్ మారుద్దాం రండి: మీ జీవితానికి అసలైన దర్శకుడు మీరే!

ఒక చిన్న పిల్లవాడు పాఠశాల బెంచీపై కూర్చుని పాఠాలు వింటున్నాడు. అప్పుడే ఉపాధ్యాయుడు క్లాసులోకి వచ్చి, పిల్లలూ, మీరు పెద్దయ్యాక ఏమవుతారు? అని అడిగారు. ఆ పిల్లాడు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, తడుము కోకుండా, నేను డాక్టర్ అవుతాను అని సమాధానం ఇచ్చాడు. ఆ సమాధానంలో ఆ పిల్లాడికి తెలియని ఒక నిజం ఉంది ఆ మాట వాడు తన సొంత ఆలోచనతో చెప్పలేదు,ఇంట్లో తల్లిదండ్రులు ప్రతి రోజూ, ప్రతి సందర్భంలోనూ అదే నూరిపోస్తున్నారు. ఆ పిల్లాడి లేత మనసులో డాక్టర్ అవ్వాలనే కోరిక నిజంగా పుట్టిందా, లేకఅది తల్లిదండ్రుల అసంపూర్ణ కలలకు ప్రతిరూపమా? ఈ ప్రశ్న కేవలం ఒక తరం సమస్య కాదు, ఇది మన సమాజంలో దశాబ్దాలుగా పాతుకుపోయిన ఒక సంక్లిష్టమైన మానసిక చట్రం. జీవిత లక్ష్యం ఇది మనిషి ఉనికికి మూలాధారం. దిశ లేని నావలా, లక్ష్యం లేని జీవితానికి అర్థం ఉండదు. కానీ,ఈలక్ష్యాన్ని ఎవరు నిర్ణయిస్తున్నారు? మనం గీసుకున్న గీతా? లేక మన కుటుంబం, సమాజం, పరిస్థితులు మన కోసం గీసిన బాటనా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకడం అంటే మనలోని నిజమైన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించుకోవడమే. భారతీయ కుటుంబ వ్యవస్థలో, ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో, పిల్లల భవిష్యత్తును నిర్ణయించే బాధ్యతను తల్లిదండ్రులు తమ భుజస్కంధాలపై వేసుకుంటారు. ఇందులో ఉన్నది స్వార్థం కాదు, అపారమైన ప్రేమ. నా కొడుకు సమాజంలో గొప్పగా బ్రతకాల,నా కూతురు ఆర్థికంగా స్థిరపడాలి అని వారు కనే కలలు వెనుక వారి సొంత అనుభవాలు, పడ్డ కష్టాలు ఉంటాయి. కానీ, కొన్నిసార్లు ఈ ప్రేమ పిల్లలకు కంచె లా మారుతుంది. మనస్తత్వవేత్తల అభిప్రాయం ప్రకా రం, పిల్లలు తమ తల్లిదండ్రులను సంతోషపెట్టడం కోసం తమ ఇష్టాలను చంపుకున్నప్పుడు, వారిలో ఒక అంతర్గత శూన్యత ఏర్పడుతుంది. బయటకు చూసేవారికి వారు సక్సెస్ ఫుల్ అనిపించవచ్చు, ఉద్యోగంలో టాప్ పొజిషన్లో ఉండవచ్చు, మంచి జీతం రావచ్చు కానీ లోపల మాత్రం అసంతృప్తి తాండవిస్తుంది. ఎందుకంటే, వారు బ్రతుకుతున్నది తమ జీవితాన్ని కాదు, తల్లిదండ్రులు వారి కోసం రాసిన స్క్రిప్ట్‌ని మాత్రమే. ఇలాంటి జీవితం మనసుకు తృప్తిని ఇవ్వదు,పైగా నిరంతరం ఏదో కోల్పోయామన్న భావనను మిగులుస్తుంది. ఇక్కడ తల్లిదండ్రులను పూర్తిగా నిందించలేం, ఎందుకంటే వారు చూసిన ప్రపంచంలో ఆర్థిక స్థిరత్వమే పరమార్థం. కానీ, మారుతున్న కాలంలో, కేవలం సెటిల్ అవ్వడం మాత్రమే జీవితం కాదని వారు గుర్తించాల్సినసమయం ఆసన్నమైంది. కుటుంబం తర్వాత మన లక్ష్యాలను శాసించేది సమాజం. అందరూ చేస్తున్న పనినే నువ్వూ చేయి, అప్పుడే క్షేమం అని సమాజం నిరంతరం మనకు చెప్తూనే ఉంటుంది. ఒకప్పుడు డాక్టర్, ఇంజనీర్ అయితేనే గౌరవం అనుకునేవారు. ఇప్పుడు ఐటీ కంపెనీలో భారీ ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరడమో, లేక విదేశాలకు వెళ్ళడమో సక్సెస్ అంటే అదే అనే ముద్ర పడిపోయింది. మన సమాజంలో మనిషిని కొలిచేది మూడుప్రశ్నలతోనే ఏంచదివావు?,ఎక్కడ ఉద్యోగం?, జీతం ఎంత? . ఒక చిత్రకారుడు తన కుంచెతో ప్రపంచాన్ని మార్చగలడు, ఒక రంగస్థల నటుడు సంభాషణలతో సమాజాన్ని మేల్కొల్పగలడు, ఒక రైతు తన కష్టంతో కోట్లాది మంది ఆకలి తీర్చగలడు. వీరందరికీ గొప్ప నైపుణ్యాలు ఉన్నా, సమాజం చూసే దృష్టిలో మార్పు లేదు. ఈ అసమాన దృక్పథమే యువతను తమ నిజమైన ప్రతిభను అణచివేసుకునేలా చేస్తోంది. కేవలం సమాజం మెచ్చుకుంటుందనో లేదా హోదా వస్తుందనో ఒక వృత్తిని ఎంచుకోవడం అంటే, మనలోని సృజనాత్మకతను మనమే చంపుకోవడమే బయట వినిపించే వేల గొంతుల మధ్య, మనలోపల నిరంతరం ఒక చిన్నగొంతు మాట్లాడుతుంది. అదే మన నిజమైన స్వ . ఆ గొంతు వినపడాలంటే నిశ్శబ్దం కావాలి, సాహసం కావాలి. నాకు నిజంగా ఏం నచ్చుతుంది?,ఏ పని చేస్తుంటే సమయం తెలియదు?,నా ఉనికి ఈ ప్రపంచానికి ఎలా దోహదపడుతుంది? ఇలాంటి ప్రశ్నలను మనం నిక్కచ్చిగా వేసుకోవాలి. సోక్రటీస్ అన్నట్టు, నీకు నీవు తెలియడం అన్నిటికన్నా గొప్ప జ్ఞానం. ఆ స్వయంజ్ఞానమే మీ లక్ష్యానికి పునాది. మీరు ఎందులో బలంగా ఉన్నారు, ఏది మీకు అసంతృప్తినిఇస్తుంది అనేది మీరు అర్థం చేసుకున్నప్పుడే, లక్ష్యం మీ సొంతం అవుతుంది. ఇది సులభం కాదు, ఎందుకంటే మనం చాలా కాలం ఇతరుల అంచనాలను మన కోరికలుగా భ్రమపడ్డాం. ఆ భ్రమల తెరలను తొలగించుకోవడమే నిజమైన వ్యక్తిత్వ వికాసం. నేటి విద్యా వ్యవస్థ ఒక ఫ్యాక్టరీ లా మారింది. మార్కులు, ర్యాంకులు, ప్లేస్‌మెంట్స్, వీటి చుట్టే విద్య తిరుగుతోంది. ప్రశ్నించేతత్వం, సృజనాత్మకత వంటివి తరగతి గదుల్లో ఎండమావులయ్యాయి. ఇంటర్మీడియట్ విద్యార్థుల పరిస్థితిని గమనిస్తే, లక్షల మంది పోటీ పరీక్షల ఊబిలో చిక్కుకుంటున్నారు. తమకు నచ్చిన రంగం ఏంటో కూడా తెలుసుకోకముందే, భవిష్యత్తు బాగుంటుందనే ప్రచారంతో బలైపోతున్నారు. విద్య అనేది వ్యక్తిని మోక్షం వైపు లేదా జ్ఞానం వైపు తీసుకెళ్లాలి కానీ, కేవలం యాంత్రికమైన ఉద్యోగాల కోసం మాత్రమే కాకూడదు. చాలామంది అపోహ ఏమిటంటే, ఒక్కసారి లక్ష్యాన్ని నిర్ణయించుకుంటే, దాని నుండి పక్కకు తప్పుకోవడం ఓటమి అని. ఇది చాలా తప్పు. లక్ష్యం అనేది పరిణామం చెందాలి. మీ అనుభవాలు పెరుగుతున్న కొద్దీ మీ దృక్పథం మారుతుంది, అది సహజం. స్టీవ్ జాబ్స్ వంటి ఎందరో గొప్ప వ్యక్తులు తమ జీవిత ప్రయాణంలో ఎన్నో మలుపులు తిరిగారు. పాతదాన్ని వదిలేసి, కొత్త లక్ష్యాన్ని ఎంచుకోవడం బలహీనత కాదు, అది మీ పరిపక్వతకు నిదర్శనం. లక్ష్యం అంటే కేవలం మీ వ్యక్తిగత అభివృద్ధి మాత్రమే కాదు. మీ విజయం సమాజానికి ఎంతవరకు ఉపయోగపడుతుందనేది కూడా ముఖ్యం. బి.ఆర్. అంబేద్కర్, గాంధీ వంటి మహనీయుల జీవితాలను చూడండి. వారి వ్యక్తిగత లక్ష్యాలు, సామాజిక శ్రేయస్సుతో ముడిపడి ఉన్నాయి. అందుకే వారు శతాబ్దాలు దాటినా ఇంకా ప్రేరణగా నిలిచారు. మీ లక్ష్యం కుటుంబం కోసమో, సమాజం కోసమో లేదా దేశం కోసమో ఉండవచ్చు కానీ అది మీ సొంతం కావాలి. జీవితం ఒక తెరిచిన పుస్తకం. అందులో మొదటి కొన్ని పేజీలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం రాశారు. అది సరే, కానీ ఆ పుస్తకం ఇప్పుడు మీ చేతిలో ఉంది. మిగిలిన పేజీలను మీరే రాయాలి. ఇతరులు రాసిన పేజీలను చూసి నిందించడం వల్ల ప్రయోజనం లేదు,అవి మిమ్మల్ని ఆకారపరిచాయి, అంతే. నిజంగా జీవించడం అంటే ఇతరుల అంచనాల కోసం బ్రతకడం కాదు, మన గొంతును మనం వినడం. కాబట్టి, ఈ రోజే ఒక్క క్షణం ఆగి ఆలోచించండి,ఈ జీవితం నిజంగా నాదా? లేక నాకు ఎవరో గిఫ్ట్‌గా ఇచ్చిన అంచనా పత్రమా? ఈ ప్రశ్నకు జవాబు వెతకడమే మీ అసలైన జీవన యాత్రకు శ్రీకారం. మీ కోసం మీరు జీవించడం మొదలుపెట్టిన రోజే, జీవితం నిజంగా అర్థవంతంగా, పరిపూర్ణంగా మారుతుంది.

డా .సూర్యదేవర రామకృష్ణ .
9490754169.

విశ్వ గురువు నుంచి విమర్శల వరకూ: మోడీ నాయకత్వంపై చర్చ

మొన్నటి వరకు "విశ్వ గురువు"గా ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం పొందిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరిస్థితి, ఇటీవల కొన్ని నెలలుగా చోటుచేసుకుంటున్న అంతర్జాతీయ, దేశీయ పరిణామాల నేపథ్యంలో చర్చనీయాంశంగా మారింది. తన పదునైన వాగ్ధాటితో ప్రత్యర్థులను మౌనంగా చేసే నాయకుడిగా పేరొందిన మోదీ, ప్రస్తుతం దేశం లోపల బయట నుంచి వస్తున్న విమర్శలపై మౌనం పాటించడం పట్ల వెల్లువల విమర్శలు వస్తున్నాయి నలువైపులా వస్తున్న ఆరోపణలకు ఆయన ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ దాని అనుబంధ సంస్థలు, ముఖ్యంగా ఆ పార్టీ ఐటీ సెల్ సామాజిక మాధ్యమాల్లో కొనసాగించిన ప్రచారం మోదీని అత్యంత శక్తివంతమైన నాయకుడిగా చిత్రీకరించింది. అయితే ఇటీవల వెలుగులోకి వచ్చిన కొన్ని అంతర్జాతీయ పరిణామాలు, విదేశాంగ విధానంపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతుండగా నరవానేబుక్‌లోని అంశాలు,ఎప్స్టీన్ ఫైల్స్, ప్రకపనలు భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం, పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, యుద్ధ ప్రభావంతో పెరుగుతున్న చమురు సంక్షోభం వంటి అంశాలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తున్నాయి. ఇదే సమయంలో విశాఖపట్నం నేవల్ పరిధిలోకి వచ్చి తిరిగి వెళుతున్న ఇరాన్ నౌకపై అమెరికా సబ్‌మరైన్ దళాలు దాడి చేసిన ఘటనలో సుమారు 75 మంది ఇరాన్ నేవీ సిబ్బంది మృతి చెందినట్టు సమాచారం వెలువడింది. పలువురిని శ్రీలంక రక్షణ దళాలు కాపాడినట్టు కూడా వార్తలు వచ్చాయి. భారత మహాసముద్ర పరిధిలో జరిగిన ఈ ఘటనపై భారత ప్రభుత్వం స్పష్టమైన స్పందన ఇవ్వలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇంకా పలు అంశాలపై పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సహా పలువురు నాయకులు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు చెప్పలేని దుస్థితిలో ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో చమురు సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రష్యా నుంచి చమురు కొనుగోలుకు అమెరికా తాత్కాలిక అనుమతి ఇవ్వడం వంటి పరిణామాలు దేశంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి అంతర్జాతీయ రాజకీయాల్లో కూడా ఈ విషయంపై చర్చ జరుగుతుంది ఇదే సమయంలో మోదీ ఇజ్రాయిల్ పర్యటన అనంతరం ఇరాన్‌పై జరిగిన దాడి కూడా రాజకీయ విశ్లేషకుల చర్చకు కారణమైంది.ప్రపంచ సంక్షోభాల సమయంలో గతంలో భారత నాయకత్వం పోషించిన పాత్రను కూడా విశ్లేషకులు ఇ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. నెహ్రూ నుంచి మొరార్జీ దేశాయ్, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ వరకు అనేక నాయకులు అంతర్జాతీయ వేదికలపై భారత స్వతంత్ర విదేశాంగ విధానాన్ని ప్రతిబింబించారని వారు పేర్కొంటున్నారు.ప్రత్యేకంగా 1971 యుద్ధ సమయంలో అమెరికా ఒత్తిళ్లను ఇందిరా గాంధీ ధైర్యంగా ఎదుర్కొన్న తీరును మరియు ఇప్పుడు ట్రంప్ చేతిలో కీలుబొమ్మగా మారి ఆయన చెప్పినట్టాల తల ఊపుతున్న మోడీని పోల్చి చూస్తున్నారు ఇందిరా సమయస్ఫూర్తి, ధైర్య సాహసాలను గుర్తించిన అప్పటి ప్రతిపక్ష నాయకుడు అటల్ బిహారీ వాజపేయి ఆమెను "దుర్గామాత"గా అభివర్ణించిన విషయం చరిత్రలో నిలిచిపోయింది.ఇలాంటి చారిత్రక ఉదాహరణల నేపథ్యంలో ప్రస్తుత నాయకత్వం అందుకు భిన్నంగా నడుచుకుంటున్న తీరును విశ్లేషకులు బెరీజు వేస్తున్నారు ఆపరేషన్ సిందూర్ గురించి మరియు ఇటీవల చోటు చేసుకుంటున్నా పరినామాల గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు భారత సార్వభౌమాధికారంపై చర్చలకు దారి తీస్తున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాల మధ్య ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ట, విదేశాంగ విధానం, నాయకత్వ ధోరణి గురించి రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది.

పబ్బు శ్రీను
సీనియర్ జర్నలిస్టు

కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

విశ్వంభర, హైదరాబాద్:
"కుంభమేళా తరహాలోనే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తాం. తెలంగాణ బ్రాండ్ ప్రతిబింబించేలా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తాం" అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో గోదావరి పుష్కరాలు 2027 క్యాబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా పుష్కరాల నిర్వహణ తేదీలు, శాఖల సన్నద్ధత, భవిష్యత్తు కార్యాచరణపై సమీక్షించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు, 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలు నిర్వహించాలని వేద పండితులు నిర్ణయించినట్లు తెలిపారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు పుష్కరాలకు తరలి వచ్చే అవకాశం ఉన్నందున గోదావరి ప్రవహించే జిల్లాల్లో ప్రముఖ దేవాలయాలను అనుసంధానిస్తూ 96 ప్రాంతాలను ప్రత్యేకంగా ఎంపిక చేసినట్లు వివరించారు.గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో ఘాట్లు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను వేగంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరుకు డీపీఆర్‌లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

మొదటి దశలో భాగంగా అధిక రద్దీ ఉండే తొమ్మిది ప్రాంతాలను టైర్-- 1 కింద ఎంపిక చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమన్వయలోపం తలెత్తకుండా ప్రత్యేక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించడంతో పాటు శాఖలవారీగా నోడల్ అధికారులను కూడా నియమించనున్నట్లు తెలిపారు. ప్రతి ఘాట్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, అత్యవసర మార్గాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు.పుష్కరాల ఏర్పాట్లలో ఎలాంటి రాజీ ఉండదని, పనుల నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రశ్నిస్తేనే హక్కులు సాధ్యం:రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

విశ్వంభర, బాగ్ లింగంపల్లి:
"డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే బోధించినట్లుగా ప్రశ్నించడం ద్వారానే హక్కుల అమలు సాధ్యమవుతుంది" అని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందర య్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో డిబిఎఫ్ అధ్యక్షుడు శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ సదస్సులో మాట్లాడుతూ బాలికలు, మహిళలు చదువ్ను ఆయుధంగా చేసుకుని సమాజంలో ముందుకు రావాలని సూచిం చారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ అత్యాచార బాధితులకు అండగా పనిచేస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అంబికా, డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుబాయ్ సంజీవ్, చుంచు రాజేందర్, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, ఉమక్క, రంగమ్మ, శారద, విజయలక్ష్మి, శ్రావణి, నవీన్ పాల్గొన్నారు.

హరికృష్ణకు మంత్రి వివేక్ పరామర్శ

విశ్వంభర, సిద్దిపేట: అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్ ఛార్జి పూజల హరికృష్ణను ఉమ్మడి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సిద్దిపేటలోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి పరామర్శించారు. హరికృష్ణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం నిరంతరం కష్టపడే నాయకుడైన హరికృష్ణ పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలో మరింత ఉత్సాహంతో పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శలో పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, కలీముద్దీన్ అహ్మద్, కౌన్సిలర్ పయ్యావుల ఎల్లం యాదవ్, పూజల గోపికృష్ణ, రాజబాహదూర్ రెడ్డి, కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్ర మహేందర్, వాహబ్, గాయసుద్దీన్, రషద్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, అంబటి మహేష్, ఎర్ర నవీన్ కుమార్, చెంది శ్రీనివాస్ ముదిరాజ్, జనార్దన్ రెడ్డి, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు రైతులంటే చిన్న చూపు

విశ్వంభర, సిద్దిపేట: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మొదటి నుంచి రైతులంటే చిన్న చూపే ఉందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమయానికి రైతుబంధు అందించారని, వ్యవసాయాన్ని రాష్ట్రానికి వెన్నెముఖగా నిలిపారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంట కోతకు వచ్చిన కూడా రైతుబంధు డబ్బులు జమ చేయలేదన్నారు. కందుల కొనుగోళ్లలో రైతులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న నియమ నిబంధన వల్ల తక్కువ ధరకే రైతులు కందులను బయట మార్కెట్లో అమ్ముకుం టున్నారన్నారు. రైతులు యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్నారని, షాపుల్లో లేని యూరియా యాపుల్లో ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఉగాది పండుగలోగా రైతులందరికీ రైతుబంధు అందించి, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు నాగరాజు రెడ్డి, మల్లిఖార్జున్, నాయకులు రెడ్డి ప్రభాకర్ రెడ్డి, పొన్నమల్ల రాములు, ఇర్షాద్ హుస్సేన్, సత్యం రెడ్డి, దరిపల్లి శ్రీనివాస్, సయీద్ , సాయి చరణ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సమాచార కమిషనర్ కు జన్మదిన శుభాకాంక్షలు

విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్ లోని సమాచార కమిషన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి కి సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోదుమూరు దయాకర్ రావు, వేముల మురళీధర్, గొల్లపల్లి రామచందర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆంధ్రా ఎంపీల కుట్రలపై దాసోజు ఆగ్రహం

విశ్వంభర, హైదరాబాద్: ఆంధ్రా ఎంపీల కుట్రలపై ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "కోతికి పుండు అయితే గోకినట్టు" తయారైంది మీ తీరు.. 12 ఏండ్లయినా ఇంకా తెలంగాణ మీద మీ ఏడుపు గొట్టు రాజకీయం ఆపరా? ఏపీకి రావాల్సిన 'ప్రత్యేక హోదా' అడిగే మొఖం లేక.. ఢిల్లీ పెద్దల కాళ్ల దగ్గర మోకరిల్లి.. ఇప్పుడు తెలంగాణ మీద విషం చిమ్ముతారా?. నాడు వందలాది తెలంగాణ బిడ్డల బలిదానాలకు కారణమైంది మీ కుట్రలు కాదా? రాష్ట్ర ఏర్పాటుకు గండికొట్టాలని చూసిన 'సైంధవులు' మీరు కాదా?. డిసెంబర్ 9 ప్రకటన నుంచి నేటి దాకా మీరు పెట్టిన ప్రతి మోకాలడ్డంకు మీద పార్లమెంట్‌లో చర్చ పెడదాం.. దమ్ముంటే రండి!. కృష్ణా జలాల్లో ఆంధ్రా సాగిస్తున్న దొంగ దోపిడీని ఎండగడతాం.. బహిరంగ చర్చకు సిద్ధమా?. తెలంగాణ రాజకీయాల్లో 'శిఖండి' పాత్ర పోషిస్తూ ఇక్కడి అభివృద్ధిని అడ్డుకుంటున్న మీ బండారం బయటపెడతాం!. ఇంత జరుగుతున్నా తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు నోరు మెదపరేం? లావు కృష్ణదేవరాయలను అక్కడికక్కడే ఎందుకు నిలదీయలేదు?.లోక్‌సభలో మీ ఎంపీలు వాగిన సొల్లు వాగుడు మీ పార్టీ అధికారిక వైఖరా? లేక వాళ్ల సొంత పైత్యమా?. ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి బతుకుతుంటే.. మీ చిల్లర రాజకీయాల కోసం చిచ్చు పెడతారా?. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకితే మాడి మసైపోతారు.. మానిన గాయాలను రేపితే తెలంగాణ సమాజం తగిన గుణపాఠం చెబుతుంది

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా విశ్వంభర "విశ్వంభర" తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060, తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108